క్లుప్తంగా

950 కేజీల రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న రేషన్ బియ్యంతో ఏఎస్‌ఓ నాగాంజనేయులు, ఎంఎస్‌ఓ శాంతిప్రియ

గోకవరం: మండలంలోని కొత్తపల్లి, కామరాజుపేట గ్రామాల్లో అక్రమంగా తరలించేందుకు నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఏఎస్‌ఓ నాగాంజనేయులు, ఎంఎస్‌ఓ శాంతిప్రియ దాడులు నిర్వహించి అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 950 కేజీల రేషన్ బియ్యం సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఓ నాగాంజనేయులు మాట్లాడుతూ రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో ఇటువంటి సంఘటనలు జరిగినట్టు దృష్టికి వస్తే ప్రజలు తమకు సమాచారం అందించాలనిని కోరారు.

మురారిలో పోలీస్ బీట్ ఏర్పాటు



మురారిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న పోలీస్ సిబ్బంది

గండేపల్లి: మండలంలోని మురారిలో వేంచేసిన కనకదుర్గమ్మ సన్నిధి ప్రాంతంలో పోలీస్ బీట్ ఏర్పాటు చేస్తున్నట్టు సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. ప్రతి ఆదివారం అమ్మవారి దర్శనానికి ప్రాంతాల నుంచి వస్తున్న భక్తుల సౌకర్యార్థం ఆ ప్రాంతంలో జూద క్రీడలు, దొంగతనాలకు తావు లేకుండా, ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా సిబ్బంది గస్తీ నిర్వహిస్తారన్నారు. మురారిలో ఆదివారం బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదు, పొగ తాగరాదు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకూడదు తదితర నినాదాలతో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

భోజనశాలకు శంకుస్థాపన



చిల్లంగి వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద భూమిపూజ చేస్తున్న దృశ్యం

కిర్లంపూడి: చిల్లంగి శ్రీనివాసానగర్‌లో వేంచేసిన వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద భోజనశాల నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. అదే గ్రామానికి చెందిన సంపర సుధాకర శ్రీవినాయక్ వర్మ తన సొంత ఖర్చులతో భోజనశాలను నిర్మిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఆలయ ప్రధాన అర్చకులు చక్రవర్తుల రఘురామచార్యులు(రఘు) సంపర సుధాకర శ్రీవినాయక్ వర్మ, వేంకట వేణి దంపతులతో చేత భూమిపూజ చేయించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

దమ్ము ట్రాక్టర్లతో రహదారులు ధ్వంసం



జగ్గంపేట మండలంలో దమ్ము చక్రాలతో రోడ్లుపై తిరుగుతున్న ట్రాక్టర్

జగ్గంపేట: ఖరీఫ్ వ్యవసాయ పనుల నేపథ్యంలో గ్రామాల్లో దమ్ముట్రాక్టర్లు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. యజమానులు ట్రాక్టర్లకు దమ్ము చక్రాలు తగిలించి రోడ్లుపై తిరుగుతున్నారు. దీంతో గ్రామీణ రహదారులు ధ్వంసమవుతున్నాయి. జగ్గంపేట మండలంలో దమ్ము చక్రాలతో తిరిగే ట్రాక్టర్లను గుర్తించి, వాటి యజమానులను మందలించినట్టు జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. గ్రామాల్లో దమ్ము చక్రాలతో తిరగడం వల్ల రోడ్లు దెబ్బతింటున్నాయని, మరోసారి దమ్ము చక్రాలతో రోడ్లపై తిరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఇ.గోకవరంలో తనకు, తన పంటకు నష్టం చేకూర్చిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధిత రైతు సత్తి వినోద్ కుమార్‌రెడ్డి చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారం 13వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా బాధిత రైతు వినోద్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాజమహేంద్రవరానికి చెందిన తాను మండలంలోని ఇ.గోకవరంలో 2016లో పది ఎకరాల భూమిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ భూమిని సాగు చేయకుండా కొంత మంది అడ్డుపడుతూ తనపై దాడికి పాల్పడుతున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.

ప్రజలు పరేషన్

- రెచ్చిపోతున్న రేషన్ బియ్యం మాఫియా
- ఇతర ప్రాంతాల నుంచి జగ్గంపేటకు వస్తున్న బియ్యం
- నిత్యం 100 టన్నుల వరకూ కొనుగోలు
- నెలకు సుమారు రూ.2 కోట్లు పైగా లాభాలు



తనిఖీల్లో పట్టుకున్న రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయి గోడౌన్‌లో దింపుతున్న కార్మికులు

జగ్గంపేట: నియోజకవర్గంలో రేషన్ బియ్యం మాఫియా రెచ్చిపోతోంది. ప్రభుత్వం పేదలకు ఉచితంగా ఇచ్చే రేషన్ బియ్యాన్ని అక్రమార్కులు తారుమారు తక్కెడు మార్ చేసి నెలకు రూ.2 కోట్లకు పైగా దోచుకుంటున్నారు. దీనికి జగ్గంపేట ప్రాంతంలోని కొన్ని రైసు మిల్లులు కేంద్ర బిందువుగా నిలుస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జగ్గంపేట పరిసరాల్లోని రైసు మిల్లులు రేషన్ బియ్యాన్ని దర్జాగా కొనుగోలు చేసి రీసైక్లింగ్ చేస్తున్నారు. ఆ బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేయడంతో పాటు సివిల్ సప్లై శాఖకు సరఫరా చేస్తున్నారు.

జోరుగా తనిఖీలు

అధికారులు రేషన్ బియ్యం అక్రమ రవాణాపై నిఘా పెట్టారు. గ్రామాల్లో రేషన్ షాపులు, పలు ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. ఇటీవల జగ్గంపేటలో జిల్లా సివిల్ సప్లయి అధికారి సత్యనారాయణరాజు మూడు వాహనాల్లో సీజ్ చేసి రూ.12 లక్షల విలువ చేసే 26 టన్నులు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో చెప్పిన మాటలు జగ్గంపేటలో రేషన్ బియ్యం మాఫియా చెలరేగిపోతోందన్న దానికి ఉదాహరణగా నిలుస్తున్నాయి.

పలు ప్రాంతాల నుంచి..

జగ్గంపేట పరిసరాల్లో మూడు రైసు మిల్లులు ఉన్నాయి. జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు జగ్గంపేటకు సుమారు 70 నుంచి 80 కిలోమీటర్ల దూరం నుంచి రేషన్ బియ్యం నిత్యం అనేక వాహనాల ద్వారా తెల్లవారుజామున చేరుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నిత్యం ఒక రైసు మిల్లు 75 టన్నులు రేషన్ బియ్యాన్ని, మరో రైసు మిల్లు 25 టన్నుల బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజలకు ప్రతి నెల రేషన్ ఇచ్చిన దగ్గర నుంచి మూడు స్టేజ్‌ల్లో రేషన్ బియ్యం రైసు మిల్లులకు చేరుతున్నట్లు తెలుస్తోంది. బియ్యాన్ని పేదల వద్ద కొనుగోలు చేసి మూడు స్టేజ్‌ల్లో రైసు మిల్లులకు చేరుస్తున్నారు. రైసు మిల్లుల్లో రేషన్ బియ్యానికి కేజీకి రూ.22 నుంచి రూ.25 వరకూ ధర చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. రైసు మిల్లుల్లో వాటిని పాలిస్ చేసి కేజీకి రూ. 5 నుంచి రూ.10 వరకూ లాభం వేసుకుని ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. జగ్గంపేట పరిసర ప్రాంతాల్లో సుమారు 100 టన్నులు బియ్యం కొనుగోలు ద్వారా నెలకు సుమారు రూ.2 కోట్లు రైసు మిల్లులకు లాభాలు వస్తున్నట్లు అంచనా. కాగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోని గొల్లప్రోలు తదితర ప్రాంతాల నుంచి రేషన్ బియ్యం ఎక్కువగా జగ్గంపేట వస్తున్నట్లు తెలుస్తోంది.



జగ్గంపేట రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాలను పట్టుకున్న అధికారులు

తనిఖీలకు సహకరించడం లేదు

జగ్గంపేట గొల్లలగుంట రోడ్డులో ఉన్న బాలాజీ రైసు మిల్లు, గోకవరం రోడ్డులోని మరో రైసు మిల్లుకు రేషన్ బియ్యం నిత్యం వాహనాల్లో వస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. బాలాజీ రైసు మిల్లు సమీపంలో రేషన్ బియ్యం పట్టుబడిన నేపథ్యంలో మిల్లులో కూడా తనిఖీలు చేద్దామంటే మిల్లు యాజమాన్యం సహకరించడం లేదు. సీఎంఆర్ పాయింట్‌గా ఉన్న బాలాజీ రైసు మిల్లులో తనిఖీలు నిర్వహించి తేడాలు ఉంటే చర్యలు తీసుకుంటాం.

సత్యనారాయణరాజు, డీఎస్‌ఓ

ఎమ్మెల్సీపై అనుచిత వ్యాఖ్యలు తగవు



ఆరుగుల మోషే

కోటనందూరు: ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయేల్‌పై పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని మాదిగ రక్షణ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆరుగుల మోషే అన్నారు. కోటనందూరులో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జనసేన పార్టీని ఏర్పాటు చేసిన పవన్‌కల్యాణ్ తాను సీఎం కాకుండా మరొకరిని సీఎం చేరారన్న బొమ్మి ఇజ్రాయేల్‌ను ఎమ్మెల్యే సత్యనారాయణ బెదిరించడం అన్యాయమన్నారు. అట్టడుగు మాదిగ సామాజిక వర్గంలో నిరుపేద కుంటుంబంలో జన్మించిన ఇజ్రాయేల్‌ను 20 మంది ఎమ్మెల్యేల మద్దతుతో మాజీ సీఎం జగన్ ఎమ్మెల్సీ చేశారన్నారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో అనుసరిస్తున్న మోసపూరిత వైఖరి, రాష్ట్రంలో చేస్తున్న అన్యాయాలు, అక్రమాలపై ఆయన పార్టీ పరంగా ప్రశ్నిస్తూనే ఉంటారన్నారు. జనసేన నాయకులు ఎమ్మెల్సీపై నోరు పారేసుకుంటే మాదిగలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఇప్పటికైనా ఎమ్మెల్సీపై అవాకులు, చెవాకులు ప్రేలడం ఆపకపోతే సంఘటితంగా పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

తాండవ ఆయకట్టుకు నీరు విడుదల



తాండవ జలాశయం గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్న హోంమంత్రి అనిత తదితరులు

కోటనందూరు: తాండవ జలాశయం నుంచి ఆయకట్టు అవసరాలకు ఆదివారం నీటిని విడుదల చేశారు. శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు, హోంమంత్రి వంగలపూడి అనిత గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి జలహారతి ఇచ్చారు. మధ్యాహ్నం 12.10 గంటలకు ప్రాజెక్టు అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, అధికారులతో కలిసి గేట్లెత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ తాండవ ప్రాజెక్టును అన్నివిధాలా అభివృద్ధి చేస్తామన్నారు. రైతుల ఆర్థిక స్వావలంబనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. డీఈఈ అనురాధ మాట్లాడుతూ ప్రాజెక్టులో ప్రస్తుతం 372.3 అడుగుల నీటి నిల్వలు ఉన్నాయని, ఇవి ఆయకట్టు అవసరాలకు 60 రోజుల పాటు సరిపోతాయన్నారు. రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అభివృద్ధి కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ, వైస్ చైర్మన్ మేడపురెడ్డి జోగిబాబు, జేఈఈలు శ్యాంకుమార్, దుర్గాప్రసాద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నాగబాబు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రాజయోగ శిక్షణ కేంద్రం ప్రారంభం



రాజయోగ శిక్షణ కేంద్ర ప్రారంభ సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ప్రత్తిపాడు: గ్రామంలో నూతనంగా నిర్మించిన బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం రాజయోగ శిక్షణా కేంద్రాన్ని కాకినాడ జిల్లా ఇన్‌చార్జి రజనీ దీదీ ఆదివారం ప్రారంభించారు. స్థానిక పంచాయతీ కార్యాలయ సమీపాన సుమారు రూ.70 లక్షలతో నిర్మించిన భవనాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రజనీదీదీ మాట్లాడుతూ మానవుని శాంతి స్వరూప స్థితిని వివరించారు. మానవుని ద్వారా సమాజం తద్వారా ప్రపంచంలో శాంతి సౌభాగ్యం నెలకొనాలని కోరారు. కార్యక్రమంలో గుడాల వెంకటరత్నం, మాజీ సర్పంచ్ యాళ్ల విశ్వేశ్వరరావు, సందీప్ (పూణే), దిల్‌రెడ్డి (మౌంట్‌అబూ), నిర్మలానంద మాతాజీ (రమణ ఆశ్రమం), బ్రహ్మకుమారీలు మీరా కుమారి, తులసి, శ్రీదేవి, వాసవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రక్షాబంధన్

బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో ఆదివారం రాఖీ పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి రజనీ దీదీ రక్షాబంధన్ విశిష్టతను వివరించారు. బ్రహ్మకుమారీలు తులసి, మాధవి, శివపార్వతి అతిథులకు రాఖీలు కట్టారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు



ప్రత్తిపాడులో యూటీఎఫ్ వ్యవస్థాపకుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ప్రత్తిపాడు: స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయ ఆవరణలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) 51వ ఆవిర్భావ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల యూటీఎఫ్ అధ్యక్షుడు కోడి శ్రీనివాసరావు యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. యూటీఎఫ్ వ్యవస్థాపకులు అప్పారి వెంకటస్వామి, వత్సవాయి సూర్యనారాయణ రాజు చిత్రపటాలకు ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమ చరిత్రలో యూటీఎఫ్ పోరాట స్ఫూర్తిని, ఉపాధ్యాయ సమస్యలపై స్పందించిన తీరును వివరించారు. ఉపాధ్యాయుల సమస్యలు, సీపీఎస్ రద్దు, పీఆర్‌సీ బకాయిల సాధన కోసం పోరు చేపట్టేందుకు సమావేశం తీర్మానించింది. యూటీఎఫ్ ఎఫ్‌డబ్ల్యూఎస్ డైరెక్టర్ రాపర్తి రామలింగేశ్వరరావు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ చుక్కల వీర గణేష్, ప్రధాన కార్యదర్శి దొడ్డిపట్ల రాజబాబు, యూటీఎఫ్ ప్రతినిధులు సీహెచ్ సూర్యావతి, ఎంవీ రమణ, ఎస్.నాగేశ్వరరావు, ఎం.స్వామికుమార్, లక్ష్మీనారాయణ, తాతబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

రౌతులపూడి: మండలంలో యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంఆర్‌సీ భవనం వద్ద యూటీఎఫ్ మండల అధ్యక్షుడు కె.హరిబాబు ఆధ్వర్యంలో పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం చేశారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ కృషిని అభినందించారు.

అధ్వానంగా అండర్‌పాస్ రోడ్డు



అధ్వానంగా ఉన్న అండర్‌పాస్

ఏలేశ్వరం: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మండలంలోని యర్రవరంలో నిర్మించిన అండర్‌పాస్ అప్రోచ్ రోడ్డు అధ్వానంగా మారింది. అండర్‌పాస్ నిర్మించి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకూ అభివృద్ధికి నోచుకోలేదు. ప్రస్తుతం ఇది ప్రమాదకరంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి మధ్యలో దీనిని నిర్మాణం చేపట్టగా రాజమహేంద్రవరం వైపు పైకి వెళ్లేందుకు రహదారి నిర్మించారు. దానికి అండర్‌పాస్ నుంచి వచ్చే మార్గానికి కలపకపోవడంతో ప్రమాదకరంగా మారింది. వర్షాలు పడితే నీరుపోయే మార్గంలేక రోజుల తరబడి నిల్వ ఉండిపోవడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. వర్షపునీరు పోయేందుకు కనీసం తాత్కాలిక డ్రెయిన్ నిర్మించలేదు. అండర్‌పాస్‌లో రాకపోకలు నిలిచిపోతే ప్రయాణికులకు సుమారు కిలోమీటర్ మేర అదనపు దూరం పెరుగుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అండర్‌పాస్‌ను అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పట్టపగలే విద్యుత్ వెలుగులు



వేళంగిలో పగలే వెలుగుతున్న వీధిలైట్లు

శంఖవరం: మండలంలోని పలు గ్రామాల్లో పట్టపగలే విద్యుత్ వీధి లైట్లు వెలుగుతున్నాయి. వేళంగి, పి.మల్లాపురం, గౌరంపేట, మండపం తదితర గ్రామాల్లో 365 రోజులూ పగలు, రాత్రి తేడా లేకుండా వీధిలైట్లు వెలుగుతున్నాయి. నిరంతరం లైట్లు వెలుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారుల నిర్లక్ష్యంతో విలువైన విద్యుత్, ప్రజాధనం వృథా అవుతున్నాయి. విద్యుత్‌ను ఆదా చేయాలని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో అది అమలు కావడం లేదు. మరోపక్క పంచాయతీలకు విద్యుత్ బిల్లుల భారం పెరుగుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధిలైట్ల నిర్వహణపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

గోకవరం: మండలంలోని మల్లవరం ఫీడర్‌ను ఆర్‌డీఎస్‌ఎస్ పథకంలో కొత్తలైన్‌గా ఏర్పాటు చేస్తున్న కారణంగా సోమవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఈఈ జేపీబీ నటరాజన్, ఏఈ వైవీఎస్ సుబ్రహ్మణ్యం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో కొత్తపల్లి, కామరాజుపేట, సూదికొండ, గంగంపాలెం, ఠాకూరుపాలెం, జగన్నాథపురం, మల్లవరం, భూపతిపాలెం, శివరామపట్నం, ఉమ్మెత్త గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

డ్రోన్ కెమెరాతో పటిష్ట నిఘా

రౌతులపూడి: గ్రామీణ ప్రాంతాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ఉండేందుకు డ్రోన్ కెమెరాలతో పటిష్ట నిఘాను ఏర్పాటు చేసినట్లు రౌతులపూడి ఎస్‌ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ట్రయల్ రన్‌గా ఆదివారం రౌతులపూడి పరిసర ప్రాంతాలైన ఏలేరు కాలువ, శివాలయం వెనుక ప్రాంతం, గ్రామంలోని వ్యవసాయ క్షేత్రాల్లో డ్రోన్ కెమెరాను ఎగుర వేసి గస్తీ నిర్వహించారు. ఈ డ్రోన్ ద్వారా అసాంఘిక శక్తుల, అక్రమార్కులపై నిఘా పెడుతున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే డ్రోన్ ద్వారా గుర్తించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అన్నదానం

గోకవరం: మండలంలోని పెంటపల్లి గ్రామదేవత ముత్యాలమ్మ ఆలయం వద్ద ఆదివారం భారీ అన్నదానం నిర్వహించారు. అమ్మవారి జాతర ముగింపును పురస్కరించుకుని భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. బీజేపీ నాయకుడు, రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్‌రావు రూ.80 వేలు విరాళం అందజేశారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. తొలుత ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అదృశ్యమైన వ్యక్తి బంధువుల చెంతకు..

గండేపల్లి: అదృశ్యమైన వ్యక్తిని గుర్తించి బంధువులకు అప్పగించినట్టు స్థానిక సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని రామేశంపేటకు చెందిన డి.రాజు తన భార్యతో గొడవపడి జూలై 31న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీనిపై గండేపల్లి పోలీస్ స్టేషన్‌లో అందిన ఫిర్యాదు మేరకు ఎస్సై యువి శివ నాగబాబు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. విశాఖలో కింగ్ జార్జి హాస్పిటల్ ప్రాంతంలో రాజును గుర్తించి బంధువులకు అప్పగించినట్టు తెలిపారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి



సమావేశంలో మాట్లాడుతున్న లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బంగార్రాజు

ప్రత్తిపాడు: గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బుగత బంగార్రాజు పిలుపునిచ్చారు. స్థానిక లిబరేషన్ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బంగార్రాజు మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్ల ద్వారా పేదలు, చిన్న వ్యాపారులు, రైతాంగం తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించి, ఉద్యమం చేపట్టాలని సూచించారు. ఈ ఉద్యమాల్లో ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు. పంద్రాగస్టు రోజున దేశాన్ని రక్షించడం – ప్రజాస్వామ్యాన్ని కాపాడండి – రాజ్యాంగాన్ని రక్షించండి అనే నినాదాలతో గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించాలని కార్యకర్తలకు సూచించారు. లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జున రావు, లిబరేషన్ అనుబంధ సంస్థల నాయకులు రేచుకట్ల సింహాచలం, కె.జనార్దన్, గొడుగు సత్యనారాయణ, శీలం అప్పలరాజు, మానుకొండ లచ్చబాబు, రాజాల రత్నం, పేరూరి లక్ష్మి, జక్కంపూడి రాజు తదితరులు పాల్గొన్నారు.

ముద్రగడ ఆరోగ్యం మెరుగుపడాలని పూజలు



సత్యదేవుని ఆయుష్యహోమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మీశివకుమారి, పార్టీ నేత కాకి నాని

అన్నవరం: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని కోరుతూ ఆ పార్టీ శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ అంగూరు లక్ష్మీశివకుమారి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి కాకి నాని ఆదివారం రత్నగిరిపై సత్యదేవునికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి నిర్వహించే ఆయుష్యహోమంలో పాల్గొన్నారు. ముద్రగడ ఆరోగ్యం మెరుగుపడాలని కోరుతూ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ లక్ష్మీశివకుమారి మాట్లాడుతూ ముద్రగడ పద్మనాభం ప్రత్తిపాడు నియోజకవర్గానికి చేసిన సేవలు మర్చిపోలేనివన్నారు. ఆయన సత్యదేవుని ఆశీస్సులతో త్వరగా కోలుకుని నియోజకవర్గంలో ప్రజలకు సేవలందించాలని కోరారు.

నిరుపయోగంగా ప్రభుత్వ స్థలాలు



ఏలేశ్వరంలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలం

ఏలేశ్వరం: పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ ఖాళీ స్థలాలు నిరుపయోగంగా మారాయి. పట్టణంలోని సువ్వయ్యమ్మపేట, కప్పల చెరువు, దిబ్బలపాలెం తదితర ప్రాంతాల్లో బహిరంగ మరుగుదొడ్లు ఉండేవి. వాటిని కూల్చి వేయడంతో ఆ స్థలాలు ఖాళీగా ఉన్నాయి. గతంలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వీటిని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కూల్చివేశారు. వీటిని కూల్చివేయడంతో సుమారు వందలాది గజాల స్థలం ఖాళీగా ఉంది. ఇవి ప్రధాన రహదారిని అనుకుని ఉండడంతో ఈ స్థలాల్లో కమ్యూనిటీ హాలు, పార్కు వంటి నిర్మాణాలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అప్పట్లో బహిరంగ మరుగుదొడ్లను పట్టణ శివారులో నిర్మించగా ప్రస్తుతం అవి ప్రధానప్రాంతాల్లో ఉన్నాయి. ప్రస్తుతం వీటి విలువ రూ.లక్షల్లో ఉంది. ఈ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



తొండంగి జెడ్పీ హైస్కూల్లో కలసిన పూర్వ విద్యార్థులు

తొండంగి: స్థానిక శృంగవృక్షం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 2005 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 20 ఏళ్ల తరువాత తాము చదువుకున్న పాఠశాలలోనే కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో ఆనందంగా గడిపారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని నిర్ణయించుకున్నారు.